సాక్షి
పల్నాడు

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024

నీ బంటు నేనయ్య..



‘ఓ బొజ్జ గణపయ్య నీ బంటు నేనయ్యా.. ఉండ్రాళ్ల మీదికి నీ దండు పంపు’ అని ఆర్తిగా పిలిస్తే పలికే దైవం, ‘ముదాక రాత్త మోదకం సదా విముక్తి సాధకం / కళాధరావతంసకం విలాసి లోక రక్షకమ్’ అని నిండుగా ప్రార్థిస్తే ఇట్టే అనుగ్రహించే పార్వతీనందనుడు, సర్వగణాలకు అధిపతుడు విఘ్నేశ్వర స్వామి. శనివారం వినాయక చవితి. పిల్లా–పెద్దా అందరూ ఆనందంగా జరుపుకొనే పర్వదినం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వరసిద్ధి వినాయక వ్రతానికి కావల్సిన పూజా సామగ్రి కొనుగోలుకు వచ్చిన భక్తులతో నరసరావుపేట పండుగ శోభను సంతరించుకుంది.

న్యూస్‌రీల్

పోలీసు నిబంధనలను పాటించకపోతే కఠిన చర్యలు

–జిల్లా ఎస్పీ కె.శ్రీనివాసరావు



అమరావతి: జిల్లాలో వినాయక చవితి ఉత్సవాలను నిర్వహించే ఉత్సవ కమిటీలు పోలీసు నిబంధనలను పాటించకపోతే చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ కె శ్రీనివాసరావు హెచ్చరించారు. శుక్రవారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ తొలుత విగ్రహ ఏర్పాటుకు కమిటీ సభ్యులు ఆయా పోలీసుస్టేషన్‌లలో అనుమతి పొందాలన్నారు. ఉత్సవాలను నిర్వహించే కమిటీ సభ్యుల పూర్తి వివరాలను పోలీసుస్టేషన్‌లో అందించాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగకుండా, వివాదాస్పద స్థలాలలో కాకుండా విగ్రహ ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. పోలీసుశాఖ నిర్ణయించిన ప్రదేశంలోనే విగ్రహాలను నిమజ్జనం చేయాలని, నిమజ్జనం అర్ధరాత్రి వరకు కాకుండా 10గంటలలోపు పూర్తిచేయాలన్నారు. వివిధ ఘాట్‌లలో భక్తులు స్నానాలు చేయటానికి వీలు లేకుండా బారికేడ్‌లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిమజ్జన కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దూరప్రాంతాల నుంచి నిమజ్జనానికి వచ్చే భక్తులు స్థానిక పోలీసులకు సహకరించాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారైన కఠిన చర్యలు తప్పవన్నారు. గుంటూరు రోడ్డు, బైపాస్ రోడ్డు, ఆరు డొంకల భావి సెంటర్‌ను, ధ్యానబుద్ద ఘాట్ వెనుక నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు. వైకుంఠపురం కరకట్ట బలోపేతానికి కృషి చేసిన గ్రామ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులను సత్కరించారు. సమావేశంలో సీఐ ఎం శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


9న జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి, శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీన కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని ఎన్ఏసీ శిక్షణ కేంద్రం వద్ద జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె.సంజీవరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాల మేరకు నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా జాబ్‌మేళా ఏర్పాటు చేసినట్టు వివరించారు. నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజి, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో పలు కంపెనీలు జాబ్‌మేళాలో పాల్గొని తమ తమ సంస్థలకు అవసరమైన ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసుకుంటాయని తెలిపారు. అభ్యర్థుల విద్యార్హతలను బట్టి రూ.11వేలు నుంచి రూ.30వేల వరకు జీత భత్యాలు లభిస్తాయన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు 9160200652, 7702921219, 7993768894 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

జిల్లాలో 222.6 మి.మీ వర్షపాతం నమోదు

నరసరావుపేట: గడిచిన 24గంటల వ్యవధిలో జిల్లాలో 222.6 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని అధికారులు శుక్రవారం తెలిపారు. అత్యధికంగా బొల్లాపల్లిలో 37.6 మి.మీ వర్షం కురిసిందని చెప్పారు. జిల్లాలో 28 మండలాలు ఉండగా వాటిలో 13 మండలాలు దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం, బెల్లంకొండ, అచ్చంపేట, క్రోసూరు, పెదకూరపాడు, రాజుపాలెం, నకరికల్లు, ముప్పాళ్ల, నాదెండ్ల, చిలకలూరిపేట, యడ్లపాడు మినహా మిగతా 15 మండలాల్లో వర్షం కురిసింది. ఆయా మండలాలను పరిశీలిస్తే...నరసరావుపేటలో 1.2, మాచర్లలో 61.0, వెల్దుర్తిలో 21.4, దుర్గిలో 9.8, రెంటచింతలలో 2.2, గురజాలలో 8.6, కారెంపూడిలో 9.2, అమరావతిలో 4.6, సత్తెనపల్లిలో 8.4, వినుకొండలో 16.2, నూజెండ్లలో 5.4, శావల్యాపురంలో 14.0, రొంపిచర్లలో 2.2, ఈపూరులో 20.8. మీటర్ల వర్షం కురిసిందని వెల్లడించారు.

పులిచింతలలో పెరిగిన నీటి ఉధృతి



అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నుంచి మళ్లీ నీటి ఉధృతి స్వల్పంగా పెరిగింది. శుక్రవారం సాయంత్రం వరకు అందిన సమాచారం మేరకు ప్రాజెక్టు నుంచి నాలుగు గేట్లను మూడు మీటర్లు పైకెత్తి 1,11,568 క్యూసెక్కులు దిగువకు వదలుతున్నారు. ఎగువ నుంచి 70,178 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రస్తుతం ప్రాజెక్టులో 72.72 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇది 173 అడుగులకు సమానం.

కోలుకునేదెన్నడో

రైతుల రెక్కల కష్టాన్ని వరద తుడిచిపెట్టింది. పెట్టుబడులను మట్టిపాలు చేసింది. అప్పులు తీర్చే మార్గం తెలీక రైతులు కుమిలిపోతున్నారు. మరో వైపు రహదారులు దెబ్బతిన్నాయి. ఎక్కడికక్కడ గోతులు పడ్డాయి. గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. ప్రజలు నరకయాతన పడుతున్నారు. ఇంకొక వైపు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ట్రాన్స్‌ఫార్మర్‌లు దెబ్బతిన్నాయి. సరఫరా నిలిచి గ్రామాల్లో అంధకారం నెలకొంది. వీటి నుంచి కోలుకునేదెన్నడో ఎవరికీ అంతుపట్టడం లేదు.



రొంపిచర్ల మండలం విప్పర్లపల్లి వద్ద కోతకు గురైన రహదారి

- అపార నష్టాన్ని మిగిల్చిన భారీ వర్షాలు, వరద
- జిల్లాలో మరమ్మతులకు గురైన 259.13 కిమీ రహదారులు
- ఇప్పటికీ పునరుద్ధరణ కాని రాకపోకలు
- విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు చర్యలు
- 28,185 ఎకరాల్లో పంట నష్టంపై ప్రాథమిక అంచనాలు
- సిబ్బంది క్షేత్ర స్థాయి పర్యటనలో మరింత పెరుగుతున్న నష్టం

సాక్షి, నరసరావుపేట: జిల్లాలో వరద నీటికి మొత్తం 259.13 కిలోమీటర్ల మేర రహదారులు దెబ్బతిన్నాయి. ఇందులో ఆర్ అండ్ బీ రోడ్లు 252.13కిమీ, పంచాయతీరాజ్ రోడ్డు ఏడు కిలో మీటర్లు ఉన్నాయి. వర్షాలకు నాలుగు రహదారులు పూర్తిగా కోతకు గురవ్వగా, 15 చోట్ల పాక్షికంగా కోతకు గురయ్యాయి. 33 చోట్ల కల్వర్టులు, చప్టాలు మరమ్మతులకు గురయ్యాయి. మూడు చోట్ల భారీ వృక్షాలు రోడ్డుపై పడటం, 42 చోట్ల నీరు రోడ్డుపై పొర్లడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. దెబ్బతిన్న రహదారులకు తాత్కాలిక మరమ్మతులకు రూ.5.8 కోట్లు, శాశ్వత నిర్మాణాలకు రూ.79.3 కోట్లు అవసరం కానుంది. వర్షాలకు జిల్లాలో 41 ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఇందులో 11 పూరిళ్లు పూర్తిగా, 20 పూరిళ్లు పాక్షికంగా ధ్వంసమయ్యాయి.

నిలిచిన రాకపోకలు


ముఖ్యంగా విజయవాడ నుంచి అమరావతికి వచ్చే ప్రధాన రహదారి వరదనీటికి కొట్టుకుపోయింది. విజయవాడ నుంచి వచ్చే బస్సులు పెదమద్దూరు వరకే తిరుగుతున్నాయి. పెదమద్దూరు నుంచి ఎండ్రాయి మీదుగా చిన్న వాహనాలు అమరావతికి రాకపోకలు సాగిస్తున్నాయి. భారీ వాహనాలు అమరావతి వెళ్లలేని పరిస్థితి. అమరావతి–క్రోసూరు రోడ్డు తాజా వర్షాలకు మరింత అధ్వానంగా మారింది. అచ్చంపేట, క్రోసూరు, అమరావతి, రొంపిచర్ల మండలాలో పలు రహదారులు కోతకు గురయ్యాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పర్యాటక కేంద్రం కొండవీడు కొండకు వెళ్లే రహదారిపై భారీ బండరాళ్లు పడటంతో ఈనెల 15వ తేదీ వరకు రాకపోకలు నిలిపివేశారు. మరోవైపు కృష్ణానది వరదనీటి ముంపునకు గురైన గ్రామాలలో పారిశుద్ధ్యం అధ్వాన్నంగా మారింది. దోమలు వృద్ధి చెంది విషజ్వరాలు ప్రబలే ప్రమాదం పొంచి ఉంది.

పంట నష్టం నమోదు చేస్తున్న వ్యవసాయ శాఖ

జిల్లాలో మొత్తం 11,579 మంది రైతులకు చెందిన సుమారు 28,185 ఎకరాల్లో పంట ముంపునకు గురైనట్టు ప్రాథమికంగా ఇప్పటికే అంచనా వేశారు. ఇందులో 195 గ్రామాల పరిధిలో 11,052 మంది రైతులకు చెందిన సుమారు 27,012 ఎకరాల్లో వ్యవసాయ పంటలన నష్టపోయినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. ఇందులో అత్యధికంగా 23,317 ఎకరాల్లో పత్తి పంట, 2,745 ఎకరాల్లో వరి, 627.5 ఎకరాల్లో కంది, 250 ఎకరాల్లో మినుము, 37.5 ఎకరాల్లో జూట్ పంటలకు నష్టం కలిగింది. మరోవైపు జిల్లాలో 527 మంది రైతులకు చెందిన 1,173 ఎకరాల్లో ఉద్యాన పంటలు వర్షాలకు దెబ్బతిన్నాయి.

విద్యుత్ సంస్థకు రూ.64.55 లక్షల నష్టం

నరసరావుపేట: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో విద్యుత్ సంస్థకు రూ.64.55 లక్షల నష్టం వాటిల్లినట్లు విద్యుత్‌శాఖ అధికారులు శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. వీటిలో రెండు 33 కేవీ ఫీడర్లు, 11కేవీ ఫీడర్లు 16, 33 కేవీ పోల్స్ ఎనిమిది, 11 కేవీ పోల్స్ 139కు నష్టం జరిగింది. లో టెన్షన్ పోల్స్ 99 పడిపోయాయి. 2.83 కిలో మీటర్ల మేర విద్యుత్ వైర్లు ధ్వంసమయ్యాయి. 88 ట్రాన్స్‌ఫార్మర్లు పాడయ్యాయి. వీటిలో చాలా వరకు నూతన పరికరాలను వినియోగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు అధికారులు తెలిపారు.



ప్రకాష్‌నగర్‌లో ట్రాన్స్‌ఫార్మర్ మారుస్తున్న సిబ్బంది

కోలుకోలేని దెబ్బ...



నేను 2.5 ఎకరాల్లో పత్తి సాగుచేశాను. ఇప్పటికే రూ.లక్ష దాకా పెట్టుబడి పెట్టాను. భారీ వర్షాలకు పంట నీట మునిగి పూర్తిగా దెబ్బతింది. తీవ్రంగా నష్టపోయాను. నాతో పాటు జిల్లాలో వేలాది మంది రైతుల బాధను ప్రభుత్వం అర్థం చేసుకొని పెట్టుబడి సాయం అందించాలి.

–వంగా నరసింహారెడ్డి, కోగంటివారిపాలెం, అచ్చంపేట మండలం.

మట్టితో నిండిపోయింది...



భారీ వర్షాలకు వరద పోటెత్తడంతో దోడ్లేరు చెరువు తెగుతుందన్న భయంతో గ్రామస్తులు గండి కొట్టారు. దీంతో ఒక్కసారిగా మా పొలాల్లోకి నీటితో పాటు పెద్ద స్థాయిలో మట్టి కొట్టుకువచ్చి మేట ఏర్పడింది. ఒకటిన్నర ఎకరాల్లో సాగుచేసిన వరి పంట మొత్తం నాశనమైంది. నిబంధనలు మేరకు పరిహారం అందిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం మాలాంటి సన్నకారు రైతులను ఆదుకోవాలి.

–బి వెంకట లక్ష్మి, దోడ్లేరు, క్రోసూరు మండలం

మళ్లీ సాగుచేయాల్సిందే...



ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశాను. అల్పపీడన ప్రభావంతో కురిసిన వర్షాలకు పత్తి మొక్కలు కుళ్లిపోయాయి. దాదాపు ముప్పావు వంతు మొక్కలు చనిపోయాయి. దీంతో పంట మొత్తం దున్నేసి తిరిగి సాగుచేయాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందజేస్తేనే రైతులు తిరిగి సాగు చేయగలరు.

–బోడెల హనిమిరెడ్డి, కోగంటివారిపాలెం, అచ్చంపేట మండలం



అచ్చంపేట మండలం కోనూరు గ్రామంలో వర్షం నీరు నిలబడి కుళ్లిన పత్తి చేను



శిరిగిరిపాడు నుంచి కొత్తపల్లి వరకు అధ్వాన్నంగా ఉన్న రహదారి



అధ్వానంగా మారిన రెంటచింతల మండలం పశర్లపాడు రహదారి



పెదకూరపాడు వద్ద గుంతలు ఏర్పడిన రహదారి

ముంచెత్తుతున్న కొండవీటి వాగు

- వాగులో పేరుకుపోయిన కంప, వ్యర్థాలు
- ఆక్రమణల బెడద
- ముందుకు కదలని నీరు
- చిన్నపాటి వర్షానికే పొంగి పొర్లుతున్న వాగు
- నీట మునుగుతున్న మూడు వేల ఎకరాలు
- నష్టపోతున్న రైతులు
- ప్రతి ఏడాదీ ఇదే దుస్థితి



కొండవీటి వాగులో పెరిగిన పిచ్చి కంప



పాటిబండ్ల వద్ద కొండవీటి వాగు

పెదకూరపాడు: చిన్నపాటి వర్షం కురిస్తే చాలు కొండవీటి వాగు పొంగిపొర్లుతుంది. వేలాది ఎకరాలలోని పంటలను ముంచెత్తుతుంది. ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రతి ఏడాదీ ఇదే తంతు. శాశ్వత పరిష్కారం గురించి ఆలోచించేవారే కరువయ్యారు. వరదలకు కొట్టుకువచ్చిన వ్యర్థాలు, పిచ్చి చెట్లతో వాగు నిండిపోయింది. దీనికితోడు పలువురు వాగును ఆక్రమించుకున్నారు. దీంతో ప్రవాహం ముందుకు సాగడం లేదు.

కొండవీటివాగు పారేదిలా..

కొండవీటి వాగు పల్నాడు జిల్లాలోని లింగంగుంట్ల, పొడపాడు, జలాల్‌పురం, పెద్దమక్కెన, పెదకూరపాడు, బలుసుపాడు, కంభంపాడు, పరస, నరుకుళ్లపాడు, లింగాపురం, వైకుంఠపురం మీదగా పారుతుంది. పేరమ్మ వాగు, పిల్ల వాగులు కూడా కొండవీటి వాగులోనే కలుస్తాయి. ఈ వాగు కింద సుమారు 3వేలు ఎకరాలు సాగు అవుతోంది. ప్రతి ఏడాదీ చిన్నపాటి వర్షానికే వాగు పొంగిపొర్లుతుంది. వేలాది ఎకరాలు నీటి పాలవుతున్నాయి. రైతులు, ముఖ్యంగా కౌలు రైతులు నష్టపోతున్నారు. ఏళ్ల తరబడి వాగు పూడికతీయకపోవడం, వాగులో కొట్టుకు వచ్చే వ్యర్థాలు పేరుకుపోయాయి. వరదలు వచ్చినప్పుడు వాగులో నీరు ముందుకు పారడం లేదు. పలువురు భూ యజమానులు వాగును ఆక్రమించుకున్నారు. భారీ వర్షాలకు వరద నీరు పొలంలోనే ఉండటంతో రైతులు రూ.కోట్లలో నష్టపోతున్నారు. రైతులు పూడిక తీయాలని ఏళ్ల తరబడి అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించిన ఫలితం శూన్యం.

పూడికతీస్తే పంటలకు రక్షణ



కొండవీటి వాగులో పూడిక పేరుకుపోయింది. పూడిక తీస్తే పంటలు మునగవు. నాకున్న రెండెకరాలు భారీ వర్షంతో వాగు పొంగి పూర్తిగా నీటిలో ఉంది. ప్రతి ఏడాదీ ఇదే సమస్య. ఆశతో సాగు చేస్తే వాగు పొర్లడం, పంట పీకడం జరుగుతుంది. వాగు పక్కన ఆక్రమణలు కూడా తొలగించాలి.

–పఠాన్ ఇనూబ్‌ఖాన్.పాటిబండ్ల

మూడెకరాలు ముంపునకు గురైంది



వరద ఉధృతికి వాగు పొంగి నా మూడెకరాల 20 సెంట్లు పత్తి పంట ముంపునకు గురైంది. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి. నా చిన్నతనంలో కొండవీటి వాగు చాలా వెడల్పు ఉండేది. కాల క్రమేణా కుచించుకుపోయింది. దీంతో వర్షం కురిస్తే వాగు పొంగి పొలాలు మునిగిపోతున్నాయి.

–సాంబయ్య, పాటిబండ్ల,

ప్రక్షాళన అవసరం



కొండవీటి వాగు, వాగుకు అనుసంధానంగా ఉన్న చిన్న వాగులను ప్రక్షాళన చేయాలి. వ్యర్థాలు, పూడికతీత పనులు చేస్తే వరద రాదు. ప్రవాహం వేగంగా పోతుంది. వాగు పొంగడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. అనేక ప్రాంతాల్లో వాగు కుచించుకుపోయింది. నీటి ప్రవాహం పెరిగినప్పుడు పంటలు మునిగిపోతున్నాయి.

– నీను రమేష్, పాటిబండ్ల

మహాగణపతి

- సత్తెనపల్లి శ్రీశ్రీ నగర్‌లో 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం
- రాష్ట్రంలోనే రెండో అతి పెద్దది
- నేటి నుంచి నవరాత్రుల పూజలు
- ఈనెల 15న నిమజ్జనం



సత్తెనపల్లిలో చివరి దశకు చేరుకున్న 61 అడుగుల మట్టి వినాయక విగ్రహం

సత్తెనపల్లి: సత్తెనపల్లి పట్టణం వినాయక చవితి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. పట్టణంలోని నాగార్జుననగర్‌లో ఉన్న శ్రీశ్రీ నగర్‌లో శ్రీ సత్యసాయి యువజన సంఘం ఆధ్వర్యంలో భారీ గణనాథుడు కొలువుదీరనున్నాడు. ఈ సంఘం ఆధ్వర్యంలో 2010 నుంచి వినాయక విగ్రహాన్ని నెలకొల్పి పూజలు జరుపుతున్నప్పటికీ 2020 సంవత్సరంలో మొదటి సారి ఎనిమిది అడుగుల మట్టి వినాయక విగ్రహాన్ని నెలకొల్పారు. ఈ ఏడాది 14వ సంవత్సరం 61 అడుగుల భారీ వినాయక మట్టి విగ్రహం రూపుదిద్దుకుంది. ఈ విగ్రహం రాష్ట్రంలోనే రెండో అతి పెద్దదిగా నిలుస్తోంది. పర్యావరణ హితానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్న ఈ వినాయక విగ్రహాన్ని ఒడిశాకు చెందిన శిల్ప కళాకారులు 15 మంది గత నెల 7 నుంచి శ్రమించి తయారుచేస్తున్నారు. ఎలాంటి రసాయనాలు వినియోగించకుండా ఎండు గడ్డి, మట్టి, కొబ్బరి తాళ్లు, కర్రలతో ఏర్పాటు చేస్తున్నారు. సినీ ఆర్ట్ డైరెక్టర్ వీరాంజనేయులు పర్యవేక్షణలో విగ్రహ నిర్మాణ పనులను చురుగ్గా సాగుతున్నాయి. ఈ నెల నాలుగు నాటికే పనులు పూర్తి కావాల్సి ఉండగా వర్షం కారణంగా శుక్రవారం రాత్రికి పూర్తి కానుంది. ఈ విగ్రహం తయారీకి రూ.7లక్షలు అంచనా. కాగా ఇప్పటి వరకు రూ.10 లక్షల వరకు ఖర్చయిందని యువజన సంఘం అధ్యక్షుడు సాయితేజరాజు తెలిపారు. శనివారం వినాయక చవితి పర్వదినం నుంచి నవరాత్రులు పూజలు నిర్వహించి 9వ రోజు అంటే ఈనెల 15న సాయంత్రం ఐదు గంటలకు ప్రతిష్టించిన చోటే నిమజ్జనం చేయనున్నట్లు వెల్లడించారు.

గణేష్ మండపాలకు లడ్డూలు వితరణ

రూ.2లక్షల విలువ చేసే లడ్డూలను అందించిన లక్ష్మీరంగారావు ఫౌండేషన్

పెదకూరపాడు: మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన 50 గణేష్ మండపాలకు సుమారు రూ.2లక్షలు విలువ చేసే 600 కిలోల లడ్డూలను మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన పరుచూరి లక్ష్మీరంగారావు ఫౌండేషన్ నిర్వాహకులు పరుచూరి నాని శుక్రవారం అందించారు. నాని మాట్లాడారు.



పెదకూరపాడులోని నాగమల్లేశ్వరస్వామి గణేష్ మండపానికి లడ్డూ అందిస్తున్న నాని

క్లుప్తంగా

పంట నష్టం అంచనాకు టీంలు ఏర్పాటు

జిల్లా వ్యవసాయాధికారి మురళి



కోనూరులో దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళి

అచ్చంపేట: పల్నాడు జిల్లాలో వర్షాలకు 10,805 హెక్టార్లలో పంట నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని కోనూరు, కస్తల గ్రామాలలో శుక్రవారం ఆయన ఏడీఏ వి.హనుమంతరావు, ఏవో పి.వెంకటేశ్వర్లుతో కలసి పంటలను పరిశీలించారు. మురళి మాట్లాడుతూ జిల్లాలో 9,370 హెక్టార్లలో పత్తి, 1090 హెక్టార్లలో వరి, 100 హెక్టార్ల మినుము, 250 హెక్టార్ల కంది, ఇంకా పెసర, మొక్కజొన్న, వేరుశనగ తదితర పంటలకు నష్టం జరిగిందన్నారు. పంట నష్టం తెలుసుకునేందుకు అన్ని రైతు సేవా కేంద్రాల పరిధిలో టీంలను ఏర్పాటుచేశామన్నారు. ఆ టీంలో పంచాయతీ కార్యదర్శి, వీఆర్‌ఓ, వ్యవసాయ విస్తరణాధికారి, అగ్రికల్చరల్ అసిస్టెంట్ సభ్యులుగా ఉంటారని చెప్పారు. 33 శాతం కంటే ఎక్కువ పంట నష్టం వాటిల్లితే ఇన్‌పుట్ సబ్సిడీకి సిఫార్సు చేయడం జరుగుతుందన్నారు. టీంలు సేకరించిన పంట నష్టం వివరాలపై ఈనెల 12 నుంచి 18 వరకు అన్ని గ్రామాలలో సోషల్ ఆడిట్ నిర్వహించి గ్రామసభల ద్వారా పంట నష్టాలపై పూర్తిస్థాయి నివేదిక తయారు చేస్తామన్నారు. ఆ నివేదికను ఈనెల 18,19 తేదీలలో ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు. ప్రస్తుతం నీటిలో ఉన్న పంటలను రక్షించుకునే విధానాన్ని రైతులకు సూచించారు. ముందుగా పంటల నుంచి నీటిని బయటకు పంపాలన్నారు. భూమిలో తేమ శాతాన్ని తగ్గించుకునేందుకు మల్టీ-కె, పోలిఫిడ్, యూరియా, మెగ్నీషియం సల్ఫేట్, బోరాక్స్, ప్లానోఫిక్ తదితరాలను తగుపాళ్లలో పంటపై చల్లాల్సి ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు, రైతులు పాల్గొన్నారు.

కన్నీటి ఖర్చులు తడిసి మోపెడు

- సమస్తం వరదార్పణం
- గృహోపకరణాలు సర్వం నీటిపాలు
- వాహనాలు నీట మునక
- వరద నీటిలోనే విద్యుత్ మోటార్లు
- జల విధ్వంసంతో ఊహకందని నష్టం

ఊహకందని జల ప్రళయం కృష్ణా తీర గ్రామాల్ని కకావికలం చేసింది. లంక గ్రామాల్లో వరదకు పాడవ్వని ఇల్లు లేదు.. వస్తువు లేదు. ప్రాణాల్ని దక్కించుకున్నామన్న ఆనందం ఆవిరైంది. ఇళ్లలోని వస్తువులు సర్వం వరద నీట మునిగి, ఎందుకు పనికిరాకుండా పోయాయి. నష్టాన్ని తలచుకొని లంక గ్రామాల ప్రజలు మౌనంగా రోదిస్తున్నారు. ద్విచక్ర వాహనాలు, పంట పొలాల్లోని విద్యుత్తు మోటార్లు, ఆటోలు, కారులు, ఫ్రిజ్‌లు, టీవీలు, వాషింగ్ మెషీన్లు, కూలర్లు, దుస్తులు, దుప్పట్లు, విద్యార్థుల పుస్తకాలు.. ఇలా ఒకటేమిటి సమస్తం వరదార్పణం అయ్యాయి. లంక గ్రామాల ప్రజల కళ్ల నీరు వరదలై పారుతోంది. – కొల్లూరు

మోటార్ల మరమ్మతులకు భారీగా ఖర్చు

కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల పరిధిలోని 26 గ్రామాల్లో సుమారు 20 వేల మందికి పైగా ప్రజలు వరద ముంపు బారిన పడ్డారు. ఇప్పుడిప్పుడే ఇళ్లకు తిరిగొస్తున్నారు. పనికిరాకుండా పోయిన వస్తువులను తొలగించి, మిగిలిన వాటిని శుభ్రపరుచుకునే పనిలో రెక్కలు ముక్కలు చేసుకుంటున్నారు. కృష్ణా నదికి ఉన్న పళంగా వరదలు రావడంతో పంట పొలాల్లో వేలాది సంఖ్యలో విద్యుత్ మీటర్లు పూర్తిగా నీట మునిగిపోయాయి. నదీ పరీవాహక గ్రామాల్లో పసుపు, కంద, అరటి, తమలపాకు, కూరగాయలు, మొక్కజొన్న వంటి వాణిజ్య పంటలను మోటార్ల ఆధారంగానే రైతులు సాగు చేస్తున్నారు. వరదకు మోటార్ల నీట మునిగాయి. ఒక్కో దాని రిపేరుకు రూ. 3 వేల నుంచి రూ. 6 వేల వరకు ఖర్చు అవ్వడంతో రైతులకు గోరుచుట్టుపై రోకలిపోటులా మారింది. కొల్లూరు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలలో 3,531 విద్యుత్తు మోటార్లు వరద నీట మునిగాయి. భట్టిప్రోలు, రేపల్లె మండలాలో కలుపుకుంటే వీటి సంఖ్య మరింత పెరగనుంది. ఈలెక్కన మోటర్ల మరమ్మతులకే రూ. 1.59 కోట్ల నుంచి రూ. 2.12 కోట్ల వరకు ఖర్చు అవ్వనున్నట్లు రైతులు వాపోతున్నారు.



సుగ్గునలంకలో వరద నీటిలో తడిసిన మోటరు



లంక గ్రామాల్లో వరద నీటిలో మునిగిన ఆటోని మరో ఆటోకు కట్టి మరమ్మతులకు తీసుకెళుతున్న డ్రైవర్లు

భారీగా వాహనాలు మునక

వరద ప్రభావిత ప్రాంతాల్లో కృష్ణమ్మ ప్రవాహం ఇళ్ల పైకప్పుల నుంచి వెళ్లడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కారులు, ట్రాక్టర్లు, లారీలు వంటి వాహనాలు మూలనపడ్డాయి. ఫ్రిజ్‌లు, కూలర్లు, వాషింగ్ మెషిన్‌లు, టీవీలు ముంపునకు గురయ్యాయి. లెక్కకు అందని సంఖ్యలో వాహనాలు, ఎలక్ట్రికల్ వస్తువులు వరద నీటిలో మునగడంతో వాటి మరమ్మతులు లంక ప్రజలకు తలకు మించిన భారంలా మారనుంది. నీట మునిగిన ఒక్కో ద్విచక్ర వాహనం మరమ్మతుకు రూ. 10 వేల వరకు ఖర్చు అవుతుంది. ఇక ఆటోలు, లారీలు, కారులకు రూ. 20 వేల నుంచి రూ. 40 వేల వరకు ఖర్చయ్యే అవకాశం ఉంది. టీవీలు, ఫ్రిజ్‌లు వంటి వాటి మరమ్మతులకు రూ. 5 వేలకు పైబడి అవుతుంది. వీటి మరమ్మతులకే రూ. 3 కోట్ల పైబడి లంక గ్రామాల ప్రజలపై అదనపు భారం పడనుంది.



ఈపూరులంకలో వరద నీటిలో కొట్టుకుపోకుండా తాళ్లతో కట్టి ఉంచిన ద్విచక్ర వాహనం



ఈపూరులంకలో ఫ్రిజ్‌ను శుభ్రం చేసుకుంటున్న గృహిణి

33,769 హెక్టార్లలో వరికి నష్టం

3,806.40 హెక్టార్లలో దెబ్బతిన్న వాణిజ్య పంటలు



చిలుమూరులంకలో దెబ్బతిన్న పసుపు

సాక్షి ప్రతినిధి,బాపట్ల: కృష్ణానది వరద ప్రభావంతో వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజకవర్గాల్లో పెద్దఎత్తున వరితో పాటు వాణిజ్య పంటలు నీట మునిగి పాడయ్యాయి. వేమూరు మండలంలో 3,250 హెక్టార్లు, చుండూరులో 4,350, భట్టిప్రోలులో 1,652, అమృతలూరులో4,150, నగరంలో 1,550, నిజాంపట్నంలో 1,180, కొల్లూరులో 809 రేపల్లెలో 2,558, చెరుకుపల్లెలో 3,500 హెక్టార్లో వరి పంట దెబ్బతింది. బాపట్ల నియోజకవర్గంలోని బాపట్ల మండలంలో 5,850, కర్లపాలెంలో 2,520, పిట్టలవానిపాలెం మండలంలో 1,250 హెక్టార్లలో వరి నీట మునిగింది. మొత్తం 33,769 హెక్టార్లలో వరి పంట పాడైంది. ఉద్యాన పంటల నష్టం చూస్తే కొల్లూరు మండలంలో 804 హెక్టార్లలో అరటి, 818 హెక్టార్లలో పసుపు, కంద 440, కూరగాయలు 184, తమలపాకు 100 హెక్టార్లలో దెబ్బతింది. భట్టిప్రోలు మండలంలో 532 హెక్టార్లలో అరటి, 472 పసుపు, 348 కంద, 60 జామ, 46 హెక్టార్లలో కూరగాయల పంటలు కలిపి మొత్తం 3,806.40 హెక్టార్లలో దెబ్బతిన్నాయి.

బైక్ రిపేరుకు రూ. 10 వేలు



వరద నీరు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో నా ద్విచక్ర వాహనాన్ని సుగ్గునలంక విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద మెరక ప్రాంతానికి తరలించా. అక్కడ కూడా వరద నీరు ప్రవహించడంతో పూర్తిగా మునిగిపోయి, ఇంజిన్‌లోకి నీరు చేరింది. మరమ్మతులు చేయించాలంటే రూ. 10 వేలు ఖర్చు తప్పేలా లేదు.

– కోట సురేష్, చిలుమూరులంక, కొల్లూరు మండలం.

ఆటో ఇంజిన్‌లోకి నీళ్లు



మెరక ప్రాంతం సైతం మునిగిపోవడంతో అక్కడ ఉంచిన నా ఆటో పూర్తిగా మునిగిపోయింది. వరద నీరు ఇంజిన్‌తోపాటు డీజిల్ ట్యాంక్‌లోకి వెళ్లడంతో మరమ్మతులు తప్పని సరైంది. ఆటోను తెనాలి మెకానిక్ వద్దకు తీసుకువెళితే రూ. 20 నుంచి రూ. 25 వేలు అవుతుందని చెప్పాడు. ఏమి చేయాలో అర్థంకాని పరిస్థితి ఏర్పడింది.

–దాసరి భానుప్రసాద్, సుగ్గునలంక, కొల్లూరు మండలం.

మోటార్లు మునగడంతో అదనపు నష్టం



విద్యుత్ మోటార్లు పంట పొలాల్లోనే ఉండటంతో వాటిని ఊడదీసుకొచ్చేందుకు విశ్వప్రయత్నం చేశాం. ఒక్కసారిగా వరద చుట్టుముట్టడంతో చేసేది లేక పొలంలో బోరుకు వదిలేయడంతో నీట మునిగిపోయింది. మోటారు తిరిగి పనిచేయాలంటే తప్పనిసరిగా వైరింగ్, బేరింగ్‌లు క్లీనింగ్ చేయించాలి. రూ.మూడు నుంచి రూ.6 వేలు దాకా అవుతుంది. మోటార్ల మరమ్మతులకు అదనంగా ఖర్చు చేయక తప్ప దు.

–కోట నరేష్, సర్పంచి, చిలుమూరులంక, కొల్లూరు మండలం

వట్టి చేతులతో మిగిలాం



చర్చిలోకి చేర్చిన స్కూటీ నీటిలో మునిగిపోయి ఇంజన్‌లోకి ఒండ్రు మట్టి, నీరు చేరింది. మరమ్మతులు తప్పడంలేదు. ఇంటిలో ఫ్రిజ్‌లు, టీవీలు సైతం మునిగిపోయి పనికి రాకుండా పోయాయి. రిపేర్ల కోసమే రూ. 20 వేల వరకు పెట్టాల్సి వస్తోంది. ప్రభుత్వమే మరమ్మతుల అయ్యే ఖర్చులు అందజేసి ఆదుకోవాలి.

కంభం జాన్‌రాజ్, క్రీస్తులంక, కొల్లూరు మండలం

చంద్రవంకలో గుర్రపు డెక్క తొలగించండి

- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు
- చంద్రవంక వాగు, నెహ్రూనగర్ బ్రిడ్జిల పరిశీలన
- విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు



చంద్రవంక వాగును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

మాచర్ల చంద్రవంక వాగులో ప్రవాహానికి అడ్డుగా ఉన్న గుర్రపు డెక్క, చెత్త తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జె.అరుణ్‌బాబు రెవెన్యూ, పురపాలక సంఘ అధికారులు ఆదేశించారు. మరలా వరద వస్తే ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. విధుల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భారీ వర్షాలకు చంద్రవంక వాగు పొంగిపొర్లటం, మాచర్ల-జమ్మలమడక వెళ్లే రహదారిలో రెండు రోజులపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు శుక్రవారం పర్యటించారు. చంద్రవంక వాగు, నెహ్రూనగర్ బ్రిడ్జిలను పరిశీలించారు. చంద్రవంక వాగు ఎంత ఎత్తులో పొంగి పొర్లుతుంది, వాగుకు నీరు ఎందుకు ఎక్కువగా వస్తున్నాయి, ప్రవాహానికి ఏమైనా అడ్డు పడుతున్నాయా అని తెలుసుకున్నారు. పట్టణ, చంద్రవంక మ్యాప్‌ను తెప్పించి పరిశీలించారు. అనంతరం సచివాలయాన్ని సందర్శించి ఉద్యోగులతో మాట్లాడారు. డ్రస్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలన్నారు. మున్సిపల్ కార్యాలయంలో పురపాలక సంఘ, మైనర్, ఇరిగేషన్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. పెద్ద కాలువ వద్ద నిమజ్జనానికి ఏర్పాట్లు చేయాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. పెద్ద కాలువ వద్ద బారికేడ్ల ఏర్పాటు, రాత్రివేళ నిమజ్జనానికి లైట్లు, పోలీసు కంట్రోల్ రూం, పోలీసు సిబ్బందిని 24గంటలు నిమజ్జన ప్రాంతంలో అందుబాటులో ఉంచాలన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిమజ్జన కార్యక్రమం పూర్తి చేసేందుకు అన్నీ శాఖాధికారులు పూర్తి చేయాలన్నారు. కలెక్టర్ వెంట గురజాల ఆర్డీవో రమాకాంత్‌రెడ్డి, తహసీల్దార్ జియా ఉల్ హుక్, పురపాలక సంఘ రెవెన్యూ ఆఫీసర్ పఠాన్ అబ్దుల్ ఖాన్, ఏఈ ఆదిత్య, సీఐలు ప్రభాకర్‌రావు, షేక్ నఫీజ్‌ఖాన్, మైనర్ ఇరిగేషన్, పురపాలక సంఘ, రెవెన్యూ, ఆర్ అండ్ బీ అధికారులు ఉన్నారు.

పల్నాడు ఖ్యాతిని ప్రపంచానికి చాటిన అజయ్ సంతోష్



రెంటచింతల: ఇటీవల శ్రీలంక దేశంలోని కలుతర నగరంలో నిర్వహించిన కామన్వెల్త్ 2024 చదరంగం (చెస్) అండర్-18 పోటీలలో దేశానికి ప్రాతినిధ్యం వహించి బంగారు, రజత పతకాలను సాధించిన రెంటచింతలకు చెందిన అజయ్ సంతోష్ పర్వతరెడ్డి అసాధారణ ప్రతిభతో పల్నాడు ప్రాంత ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాడు. ఇప్పటికే అంతర్జాతీయ ప్రమాణాన్ని 2400 ఫిడేల్లో రేటింగ్ పాయింట్లతో అజయ్ సంతోష్ ఐఎం నార్మ్స్ సాధించాడు. అండర్-18 విభాగంలో దేశానికి ప్రాతినిధ్యం వహించి విశేష ప్రతిభ కనబరచడంతో భారత జట్టు ఓపెన్, బ్లిట్జ్ విభాగాలలో బంగారు, ర్యాపిడ్ విభాగంలో రజత పతకాలను సాధించి నిర్వాహకుల నుంచి నగదు బహుమతిని అందుకున్నారు. ఆగస్టులో దుబాయిలో జరిగిన 30వ అబుదాబి అంతర్జాతీయ చదరంగం ఫెస్టివల్ పోటీలలో అజయ్ సంతోష్ విజేతగా నిలిచి బంగారు పతకం సాధించాడు. చదరంగంలో అత్యున్నత స్థాయికి చేరుకుని భారతదేశం గర్వించదగ్గ క్రీడాకారుడిగా ఖ్యాతి పొందుతున్న అజయ్ సంతోష్ ఈ ఏడాది అక్టోబర్ 28 నుంచి నవంబర్ 10 వరకు బ్రెజిల్‌లో జరగనున్న ప్రపంచ యూత్ చెస్ చాంపియన్‌షిప్ 2024 ఎంపికైనట్లు తల్లిదండ్రులు వెంకట మయూర్ బాబు, సంధ్యారాణి తెలిపారు.

యుడైస్‌లో కచ్చితమైన సమాచారం ఇవ్వాలి

విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ ఆర్ఎస్ గంగాభవాని



మాట్లాడుతున్న గంగాభవాని

నరసరావుపేట రూరల్: యుడైస్‌ను పొరపాటు లేకుండా పూర్తిచేయాలని జిల్లా విద్యాశాఖ నోడల్ అధికారి, రాష్ట్ర అడిషనల్ డైరెక్టర్ మధ్యాహ్న భోజనం, సమగ్ర శిక్ష ఆర్ఎస్ గంగాభవాని తెలిపారు. లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం జిల్లా విద్యాశాఖ, ఉప విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. గంగాభవాని మాట్లాడుతూ యుడైస్‌లో ఖచ్చితమైన సమాచారాన్ని ఇవ్వాలని తెలిపారు. స్కూల్ ప్రొఫైల్, టీచర్స్ డేటా, స్టూడెంట్స్ ప్రొఫైల్‌లో యదార్థ సమాచారం ఇవ్వాలన్నారు. దీని ఆధారంగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కీలక నిర్ణయాలు తీసుకుంటాయని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్‌లు హైస్కూల్స్‌లోనే ఉండాలన్నారు. ఎక్కడైన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఉంటే వాటిని హైస్కూల్స్‌కు మార్చాలని తెలిపారు. మండలాన్ని, విద్యార్థులను, ఉపాధ్యాయులను సమానంగా కాంప్లెక్స్‌లకు విభజించాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారులు తరచూ పాఠశాలలను సందర్శించాలన్నారు. రిపోర్ట్‌ను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సర్దుబాటులో భాగంగా జిల్లాలో 483మంది ఉపాధ్యాయులను అవసరం ఉన్న చోట్లకి మార్పు చేయడం జరిగిందన్నారు. అకడమిక్ క్యాలెండర్‌ని అన్ని పాఠశాలలు తప్పనిసరిగా పాటించాలని స్పష్టంచేశారు. అనంతరం జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిలా విద్యాశాఖ అధికారి ఎంవై వెంకటేశ్వర్లు, ఉప విద్యాశాఖ అధికారి వేణు, ఏసుబాబు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రైవేటు పాఠశాలల సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

మహిళపై లైంగిక దాడికి యత్నం

నరసరావుపేట రూరల్: వివాహితపై యువకుడు లైంగిక దాడికి యత్నించిన ఘటన ఎస్ఆర్‌కేటి కాలనీ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. నెల్లూరు జిల్లా కొవ్వూరు మండలానికి చెందిన మహిళ పిడుగురాళ్లలో బాషా అనే వ్యక్తి ఇంట్లో పని కోసం వచ్చింది. శుక్రవారం తన స్వగ్రామం కొవ్వూరు వెళ్తా అని బాషాకు చెప్పడంతో నరసరావుపేటలో బస్సు ఎక్కించేందుకు ఎస్ఆర్‌కేటి కాలనీకి చెందిన సాయిని ఆమె వెంట పంపించాడు. సాయి మహిళను ఎస్ఆర్‌కేటి కాలనీ సమీపంలోని పంట పొలాల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి ప్రయత్నించాడు. మహిళ ప్రతిఘటించడంతో ఆమెపై దాడి చేశాడు. మహిళ కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి రావడంతో సాయి పరారయ్యాడు. విషయం తెలుసుకున్న ప్రజాసంఘాల నాయకులు జి.రామకృష్ణ, వి.కోటనాయక్‌లు బాధితురాలిని పరామర్శించారు. ప్రజాసంఘాల నాయకుల సహకారంతో బాధిత మహిళ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ మానసిక స్థితి సరిగా లేదని, విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని రూరల్ ఎస్ఐ ప్రియాంక తెలిపారు.

మట్టి ప్రతిమలతో వినాయకచవితి నిర్వహించుకోవాలి

- ప్రజలను కోరిన పర్యావరణ ఇంజినీరు సుధ
- పర్యావరణ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి ప్రతిమలు పంపిణీ



మట్టి ప్రతిమలనే వాడాలంటూ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఇంజినీరు కురుభ సుధ



ఉచితంగా వినాయకుని ప్రతిమలు అందజేస్తున్న ఇంజినీరు కురుభ సుధ

నరసరావుపేట: మట్టితో తయారు చేసిన వినాయకుని ప్రతిమలనే వాడి పర్యావరణ అనుకూలమైన వినాయక చవితి నిర్వహించుకోవాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంట్ అసిస్టెంట్ ఇంజినీరు కురుభ సుధ ప్రజలను కోరారు. వినాయక చవితి సందర్భంగా శుక్రవారం గుంటూరుకు చెందిన తమ శాఖ ఆధ్వర్యంలో నరసరావుపేట పట్టణంలోని పురపాలక కార్యాలయం, రైల్వేస్టేషన్ రోడ్డులలో మట్టి వినాయకుని ప్రతిమలను ఉచితంగా పంపిణీ చేశారు. మట్టి వినాయకులనే వాడాలంటూ పోస్టర్ ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ విగ్రహాల తయారీకి సహజ సిద్ధమైన రంగులు, ప్రకృతిలో లభ్యమయ్యే పత్తి, నార వంటి పదార్థాలను వినియోగించాలని కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారుచేసిన విగ్రహాలలో జిప్సమ్, గంధకం, మెగ్నీషియం, కాడ్మియం, పాదరసం, ఆర్సెనిక్, తగరం, కర్బనం వంటి ప్రమాదకరమైన రసాయనాలు ఉండుట వలన జలవనరులు కలుషితమౌతాయని, అందువలన ఆయా విగ్రహాలను పూజలకు వాడరాదని సూచించారు. విగ్రహాల అలంకరణకు వాడే ప్లాస్టిక్, థర్మాకోల్ వంటి వస్తువుల వలన జలవనరులు కలుషితమౌతాయన్నారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాల వలన నీటిలోని జీవరాశుల మనుగడ ప్రశ్నార్థకమౌతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. పర్యావరణ పరిరక్షణతోనే మానవుల మనుగడ సాధ్యమౌతుందన్నారు. సిబ్బంది కె.సుమంత్ పాల్గొన్నారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

మార్టూరు: జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మరణించాడు. ఈ ఘటన మార్టూరు సమీపంలో జరిగింది. సీఐ మద్దినేని శేషగిరిరావు వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామానికి చెందిన షేక్ కాలేషావలి (40) గురువారం మార్టూరులోని బంధువుల ఇంటికి వచ్చాడు. రాత్రి 11 గంటల ప్రాంతంలో స్థానిక అంబేడ్కర్ కాలనీ ఎదురుగా రహదారి దాటుతున్న కాలేషా వలిని చెన్నై నుంచి గుంటూరు వెళ్తున్న 12 టైర్ల లారీ అతివేగంగా ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం ఉదయం మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసుల లారీ డ్రైవర్ గొర్రె సాంబశివరావుపై కేసు నమోదు చేశారు. కాలేషావలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు సీఐ తెలిపారు.